సాక్షి అనంతపురం

బుధవారం, 15, నవంబర్, 2023



కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. మంగళవారం 5,645 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది.



టమాట కిలో రూ.20

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.20 పలికింది. కనిష్టం రూ.10, సరాసరి రూ.16 ప్రకారం క్రయ విక్రయాలు సాగాయి.

గరిష్టం/కనిష్టం

33.2°/ 17.6°

జిల్లా అంతటా మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. చలి వాతావరణం నెలకొంది. పగలంతా ఆకాశం మేఘావృత మైంది. ఈశాన్యం దిశగా గాలులు గంటకు 4 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

'సత్యసాయి జయంతి ఉత్సవాలకు విచ్చేయండి'



గవర్నర్‌తో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్ రాజు

ప్రశాంతి నిలయం: 'అందరినీ ప్రేమించి, అందరినీ సేవించు' అంటూ ప్రపంచ వ్యాప్తంగా భక్తులను పొందిన సత్యసాయి జయంత్యుత్సవాల్లో పాల్గొనాలని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ బృందం ఆహ్వానించింది. మంగళవారం సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్‌రాజుతో పాటు ట్రస్ట్ సభ్యులు విజయవాడలోని రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను మార్యాదపూర్వకంగా కలిశారు. సత్యసాయి జయంత్యుత్సవాల్లో భాగంగా ఈనెల 22న సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ స్నాతకోత్సవం జరుగుతుందని, వేడుకల్లో పాల్గొనాలని కోరారు. అందుకు గవర్నర్ సానుకూలంగా స్పందించారని ప్రశాంతి నిలయం మీడియా విభాగం ఒక ప్రకటనలో తెలిపింది.

అటవీ శాఖలో పదోన్నతులు

అనంతపురం సెంట్రల్: రాష్ట్ర వ్యాప్తంగా పలువురు అసిస్టెంట్ కన్జర్వేటర్స్ ఆఫ్ ఫారెస్ట్ అధికారులకు సబ్ డీఎఫ్‌ఓగా పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అనంతపురం రేంజ్ పరిధిలో బుక్కపట్నం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వేణుగోపాల్‌కు పలమనేరు సబ్ డీఎఫ్‌ఓగా, కళ్యాణదుర్గం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రామ్‌సింగ్‌కు శ్రీశైలం సబ్ డీఎఫ్‌ఓగా పదోన్నతి కల్పించారు.

అసభ్యకర ప్రవర్తన కేసులో ఉపాధ్యాయుడి అరెస్ట్



అనంతపురం క్రైం: బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారన్న కేసులో నిందితుడైన జ్యోత్స కుమార్ అనే ఉపాధ్యాయుడిని 'దిశ' పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను 'దిశ' డీఎస్పీ ఆంథోనప్ప మీడియాకు వెల్లడించారు. మూడు నెలల క్రితం ఆత్మకూరు మండలంలోని ఓ గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న జ్యోత్సకుమార్ అక్కడ చదువుకుంటున్న బాలికలకు అశ్లీల వీడియోలు చూపించి.. వారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారని ఓ బాధితురాలి తల్లి ఇటీవల 'దిశ' స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఉపాధ్యాయుడిపై పోక్సో చట్టం కింద సీఐ గోవిందు కేసు నమోదు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు రెండు బృందాలుగా ఏర్పడిన పోలీసులు మంగళవారం రాత్రి జ్యోత్సకుమార్‌ను అరెస్ట్ చేశారు. చిన్నారులపై లైంగిక వేధింపులకు పాల్పడేవారు ఎంతటివారైనా సరే చట్టం కఠినంగా శిక్షిస్తుందని ఎస్పీ హెచ్చరించారు.

అమ్మ ఒడి.. ఆనందాల బడి

- చిన్నారుల భవితకు బంగారుబాట
- 'నాడు – నేడు'తో మారిన స్కూళ్ల రూపురేఖలు
- 'అమ్మ ఒడి' ద్వారా నాలుగేళ్లలో తల్లుల ఖాతాల్లోకి రూ.1,718 కోట్లు

జిల్లాలో అమ్మ ఒడి పథకం ద్వారా సాయం..

కేటగిరీ	లబ్ధిదారులు	సొమ్ము (రూ.కోట్లలో)
తొలి ఏడాది (ఉమ్మడి జిల్లా)	3,62,579	543.87
రెండో ఏడాది(ఉమ్మడి జిల్లా)	3,81,559	572.34
మూడో ఏడాది	2,16,842	325.26
నాలుగో ఏడాది	2,13,394	277.41



ప్రభుత్వ పాఠశాల తరగతి గదిలో పాఠం వింటున్న విద్యార్థులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, అనంతపురం: తల్లి ఒడిలో ఉన్నప్పుడు బిడ్డ ఎంత భరోసాతో ఉంటుందో వర్ణించలేం. తల్లి అండగా ఉంది.. నన్నెవరూ ఏమీ చేయలేరన్న ధీమా ఆ చిన్నారిది. అలాంటిది ప్రభుత్వం నుంచి ధీమా లభిస్తే తల్లీ బిడ్డల ఆనందానికి అవధులుండవు. జగనన్న ప్రభుత్వ హయాంలో అమ్మ ఒడి పేరిట ఇస్తున్న ఆర్థికసాయం లక్షలాదిమంది చిన్నారుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తోంది. తమ బిడ్డలను బడికి పంపి, వారి విద్యాభ్యాసానికి బాటలు వేసేందుకు సర్కారు చేపట్టిన 'అమ్మ ఒడి' పథకం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆరోగ్యశ్రీ పథకం దేశవ్యాప్తంగా ఎలా ప్రాచుర్యం పొందిందో ఇప్పుడు 'అమ్మ ఒడి' అదే స్థాయిలో అత్యంత ప్రజాదరణ పొందుతోంది.

నాలుగేళ్లలో రూ.1,718 కోట్ల పైనే

అమ్మ ఒడి పథకం కింద తొలి ఏడాది విద్యార్థి తల్లికి రూ.15 వేలు, ఆ తర్వాత నుంచి పాఠశాల నిర్వహణ ఖర్చుల కింద ఆ మొత్తంలోంచి రూ.2వేలు మినహాయించి ఆర్థికసాయం అందిస్తోంది. అమ్మ ఒడి పథకంలో భాగంగా గడిచిన నాలుగేళ్లలో విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి అక్షరాలా రూ.1,718.88 కోట్లు జమ అయ్యింది. రెండేళ్ల పాటు ఉమ్మడి జిల్లాకు, ఆ తర్వాత విడిపోయిన అనంతపురం జిల్లాకు ఈ సొమ్ము జమ అయింది. తొలి రెండేళ్లలో 3.62 లక్షల మంది తల్లులకు లబ్ధి చేకూరగా, జిల్లాల పునర్విభజన తర్వాత తర్వాతి రెండేళ్లలో 2.16 లక్షల మంది తల్లుల ఖాతాల్లోకి సొమ్ము పడింది. ఈ సొమ్మును పిల్లల చదువులు, అవసరాల కోసం తల్లిదండ్రులు వెచ్చిస్తూ బడికి క్రమం తప్పకుండా పంపుతున్నారు.

ప్రభుత్వ స్కూళ్లకు పునరుజ్జీవం

గత ప్రభుత్వం హయాంలో ప్రభుత్వ స్కూళ్లంటే చిన్నచూపు చూశారు. శిథిలావస్థకు చేరుకున్న భవనాలు, టీచర్ల కొరత, అరకొర పుస్తకాలు.. ఇలాంటి సమస్యలతో చిన్నారులు పాఠశాలలకు వెళ్లే వారు కాదు. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక ప్రభుత్వ స్కూళ్లకు పునరుజ్జీవం వచ్చింది. ప్రతి విద్యార్థికీ బూట్లు, సాక్సులు ఉచితంగా ఇస్తున్నారు. నాడు – నేడు కార్యక్రమం కింద ప్రభుత్వ స్కూళ్లలో సౌకర్యాలు మెరుగుపరచి రూపురేఖలు మార్చేశారు. 8వ తరగతి పిల్లలందరికీ ఉచితంగా ట్యాబ్‌ల అందించారు. గతంలో మాదిరిగా మధ్యలో స్కూళ్లు మానేయకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. డ్రాపౌట్స్ తగ్గేందుకు వలంటీర్ల ద్వారా చిన్నారులను తిరిగి బడికి వచ్చేలా చేస్తున్నారు. ప్రతి స్కూల్లోనూ హిమోగ్లోబిన్ పరీక్షించి, ఐరన్‌ఫోలిక్ మాత్రలు అందిస్తున్నారు.

కూతుర్ని బాగా చదివిస్తున్నా



నేను, నా భర్త రోజూ కూలి పనులతో జీవనం సాగిస్తున్నాము. మాకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కుమార్తె డి.క్రిష్ణవేణి కళ్యాణదుర్గంలోని కరణం చిక్కప్ప ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. జగనన్న సీఎం అయినప్పటి నుంచి ఏటా 'అమ్మ ఒడి' డబ్బులు నా బ్యాంకు అకౌంట్‌లో పడుతున్నాయి. నా కూతుర్ని ఇప్పుడు బాగా చదివిస్తున్నాం.

–డి.గాలెమ్మ, ముప్పలకుంట, బ్రహ్మసముద్రం మండలం



పిల్లల చదువులకు చేయూత



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న అమ్మ ఒడి పథకం మా బిడ్డల చదువులకు చేయూతనందిస్తోంది. మాకు ముగ్గురు కూతుళ్లు. వీరిలో సంజన 5వ తరగతి, నిషా 4వ తరగతి, మోక్షిత 1వ తరగతి స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్నారు. అమ్మ ఒడి పథకం ప్రవేశ పెట్టినప్పటి నుంచి నాలుగుసార్లు డబ్బులు అందాయి. మా బిడ్డల చదువులకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతోంది.

– సువర్ణ, పెనకచెర్ల గ్రామం, గార్లదిన్నె మండలం

గుణాత్మక విద్య బోధించాలి



మాట్లాడుతున్న డీఈఓ నాగరాజు

అనంతపురం ఎడ్యుకేషన్: లర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎల్‌ఐపీ) ద్వారా పిల్లలకు గుణాత్మక విద్యను బోధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి నాగరాజు, సమగ్ర శిక్ష ఏపీసీ వరప్రసాదరావు సూచించారు. లర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాంపై ఎంఈఓలు, హెచ్‌ఎంలకు రెండురోజుల పాటు జరిగే శిక్షణ మంగళవారం ప్రారంభమైంది. అనంతపురంలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ నగరపాలక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన శిక్షణకు డీఈఓ, సమగ్ర శిక్ష ఏపీసీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ–2020లో భాగంగా 2026 నాటికి పిల్లలందరూ చదవగలిగి, రాయగలిగే లాగా ఉండాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 6, 7, 8 తరగతుల పిల్లల కోసం లర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం ప్రారంభించిందన్నారు. కార్యక్రమాన్ని పాఠశాలల్లో మానిటరింగ్ చేసే మండల విద్యాధికారులు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులకు రెండు రోజుల శిక్షణ ఉంటుందన్నారు. బోధనలో టీచింగ్ పీరియడ్‌తో పాటు ప్రాక్టీస్ పీరియడ్ కూడా ఉంటుందన్నారు. తరగతులను తరచుగా సందర్శించాలని ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రామకష్ణ, డీవైఈఓ పద్మప్రియ, రాష్ట్ర పరిశీలకులు వెంకటరెడ్డి, సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులు మాధవరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అజ్ఞాత హ్యాకర్ ఎవరు?

- ఎస్పీ పేరుతో సీఐలకు వాట్సాప్ కాల్
- ఆరోగ్యం బాగలేదని.. డబ్బు ఫోన్ పే చేయాలని రిక్వెస్ట్
- అప్రమత్తమై ఎస్పీకి ఫోన్ చేసిన ఓ సీఐ
- సైబర్ నేరగాడని నిర్ధారణ
- కోయంబత్తూరు మహిళ సెల్ నుంచి కాల్స్ వచ్చినట్లు తేల్చిన ప్రత్యేక బృందం



అనంతపురం క్రైం: సైబర్ నేరగాళ్లు పేట్రేగిపోయారు. తమను ఎవ్వరూ పట్టుకోలేరని ఏకంగా పోలీస్ బాస్ పేరునే వినియోగించుకున్నారు. కిందిస్థాయి అధికారులకు వాట్సాప్ కాల్స్ చేసి డబ్బు కోసం రిక్వెస్ట్ చేశారు. అయితే సదరు అధికారులు అప్రమత్తం కావడంతో సైబర్ నేరగాళ్ల వలకు చిక్కలేదు. వివరాలిలా ఉన్నాయి. అనంతపురం వన్‌టౌన్, టూటౌన్ సీఐలకు నాలుగు రోజుల కిందట ఫోన్ కాల్ వచ్చింది. 'నేను ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్‌ను మాట్లాడుతున్నా.. నాకు అనారోగ్యం చేసింది. రూ.50 వేలు ఫోన్‌పే పంపండి' అని చెప్పారు. ఇద్దరికీ నిమిషాల వ్యవధిలోనే ఈ ఫోన్‌లు రావడంతో టూటౌన్ సీఐ శివరాముడు ఎస్పీకి ఫోన్ చేసి తనకేమైనా కాల్ చేశారా అని అడగ్గా.. లేదని చెప్పారు. ఆ తర్వాత ఇద్దరు సీఐలు ఫోన్ ద్వారా మాట్లాడుకోవడంతో ఈ విషయం బహిర్గతమైంది. ఇదిలా ఉండగానే ఇటుకలపల్లి సీఐకి కూడా ఫోన్ వచ్చింది. ఆయనకూ 'సేమ్ డైలాగే'. అప్రమత్తమైన పోలీసు ఉన్నతాధికారులు కిందిస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. మరుసటి రోజే ఉన్నతాధికారుల పేరుతో సైతం సైబర్ నేరగాళ్లు డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. దీంతో ప్రజలను కూడా అప్రమత్తం చేస్తూ ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ మీడియాకు ప్రకటన విడుదల చేశారు. అందరూ అప్రమత్తంగా ఉండాలని చెబుతూ...మీ పేర్లను కూడా నేరగాళ్లు వాడుకునే అవకాశం ఉందని హెచ్చరించారు. పోలీసు అధికారులు, సిబ్బంది సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

కాల్ చేసిన వ్యక్తి ఎవరు?

నేరుగా ఎస్పీ పేరుతో ఫోన్ కాల్స్ చేసిన నేరగాళ్లెవరన్నది ప్రస్తుతం పోలీసు అధికారుల మదిలో మెదులుతున్న ప్రశ్న. వన్‌టౌన్ సీఐ రెడ్డెప్ప ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దింపారు. సైబర్ నేరగాన్ని గుర్తించేందుకు పక్కా ప్లాన్ చేశారు. కాగా ఐటీ యాక్ట్ ప్రకారం నిందితులను అదుపులోకి తీసుకునేందుకు చాలా ఆటంకాలు ఎదురవుతాయి. ఐఎంఈఐ నంబరు ఆధారంగా అనంతపురం నుంచి తమిళనాడుకు వెళ్లిన ప్రత్యేక దర్యాప్తు బృందం ఎట్టకేలకు కోయంబత్తూరుకు చెందిన ఓ మహిళ సెల్ కాల్స్ వచ్చినట్లు నిర్ధారణకు వచ్చింది. ఆమెను ప్రశ్నించేందుకు వీలులేక పోవడంతో ఆమెకు 41 నోటీసు జారీ చేశారు.

మహిళ ఫోన్ హ్యాక్..

తన నంబరు నుంచి ఎలాంటి కాల్స్ చేయలేదని కోయంబత్తూరు మహిళ ప్రత్యేక దర్యాప్తు బృందానికి తెలిపింది. మహిళ సెల్ నంబర్‌ను హ్యాక్ చేసి, అందులోని కాంటాక్ట్ నంబర్లతో పాటు ఎస్పీ అన్బురాజన్ నంబర్‌ను చేర్చినట్లు గుర్తించారు. ఆ నంబరు నుంచి ఎస్పీ కాల్ చేసినట్లుగా సీఐలను బురిడీ కొట్టించాలని చూశారు. సీఐలు అప్రమత్తతతో హ్యాకర్స్ కథ అడ్డం తిరిగింది.

సరిహద్దు ప్రాంతం నుంచి కాల్స్ వచ్చాయా?

తమిళనాడులోని మహిళ సెల్‌ఫోన్‌ను హ్యాక్ చేసిన సైబర్ నేరగాళ్లు... అందులో ఎస్పీ నంబరును యాడ్ చేసి కాల్స్ చేశారని ప్రాథమికంగా తెలుస్తోంది. ఆమె ఫోన్ నుంచి కాల్స్ చేయలేదు...ఆ కాల్స్ ఓ కంప్యూటర్ నుంచి వచ్చినట్లు గుర్తించారు. దీంతో ఈ వ్యవహారం దేశ సరిహద్దు ప్రాంతాల నుంచి వచ్చి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. కాగా వారికి, ఈ మహిళకు ఏమైనా సంబంధాలున్నాయా అన్న కోణంలో కూడా దర్యాప్తు సాగుతోంది.

రైతులకు ఈ-క్రాప్ రసీదులు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా అధికారులు

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్‌లో ఈ–క్రాప్, ఈ–కేవైసీ చేయించుకున్న రైతులందరికీ రసీదులు ఇవ్వాలని వ్యవసాయశాఖ కమిషనర్ సి.హరికిరణ్ జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన గుంటూరు నుంచి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఖరీఫ్‌లో వ్యవసాయ, ఉద్యాన పంటల సాగుకు సంబంధించి ఈ–క్రాప్ చేయించుకున్నట్లు రైతుల దగ్గర ఆధారం ఉంటే భవిష్యత్తులో ఇన్‌పుట్, ఇన్సూరెన్స్, ఎంఎస్‌పీ అమ్మకాలు, పంట రుణాల సున్నావడ్డీ లాంటి వాటికి ఇబ్బంది ఉండదన్నారు. అలాగే రబీ స్థితిగతులు, వర్షాలు, పంటల సాగు, ఈ–క్రాప్ నమోదు, కిసాన్ డ్రోన్లు, పైలట్ శిక్షణ, కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ల (సీహెచ్‌సీ) పనితీరు, పొలంబడి, ఎస్‌ఎఫ్‌ఎస్‌ఎం కింద చిరుధాన్యాల సాగు, ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, రెయిన్‌ఫెడ్ ఏరియా డెవలప్‌మెంట్, భూసార పరీక్షలు, ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్ ల్యాబ్‌ల పనితీరు, విత్తనాలు, ఎరువుల పంపిణీ తదితర అంశాలపై తెలుసుకున్నారు. వర్షాభావ పరిస్థితులు నెలకొన్న ప్రస్తుత తరుణంలో రైతుల్లో మనోధైర్యం నింపడానికి అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు కొనసాగించాలని ఆదేశించారు.

సాగుదారులకు త్వరలో 'హక్కు'



అనంతపురం అర్బన్: రైతు సంక్షేమం లక్ష్యంగా జగన్ సర్కార్ చర్యలు చేపడుతోంది. ఏళ్లుగా ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్న రైతులకు మేలు చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. భూ పంపిణీ ద్వారా రైతులకు సాగు హక్కు కల్పించి శాశ్వత లబ్ధి చేకూర్చేందుకు కృషి చేస్తోంది. ఈ మేరకు జిల్లాలో భూ పంపిణీకి సంబంధించిన కసరత్తు రెవెన్యూ శాఖ పూర్తి చేసింది. జిల్లావ్యాప్తంగా 1,670.08 ఎకరాల ప్రభుత్వ భూమిని 1,231 మంది రైతులు సాగు చేస్తున్నట్లు గుర్తించి సాగు హక్కు పట్టాల కోసం జాబితా సిద్ధం చేసింది.

సాగు హక్కు పట్టాకు అర్హతలు..

- రైతుకు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూమి తప్ప ఇతరత్రా పట్టా భూమి ఉండకూడదు.
- సాగు చేసుకుంటున్న భూమిని ఇంతకు ముందు ఎవరికీ డీ–పట్టా ఇచ్చి ఉండకూడదు.
- లబ్ధిదారుల జాబితా సిద్ధం
- ప్రభుత్వ అనుమతి రాగానే పట్టాల పంపిణీ
- పట్టా కోసం దరఖాస్తు చేసుకున్న భూమిలో ఆ రైతు తప్పనిసరిగా సాగులో ఉండాలి.
- అర్హత ఉన్న రైతుకూ తరి 2.50 ఎకరాలు లేదా మెట్ట 5 ఎకరాలకు మించకుండా డీ–పట్టా మంజూరు చేస్తారు.

ఏ భూములకు పట్టా ఇవ్వరంటే...

ప్రభుత్వం నిబంధనల ప్రకారం పొరంబోకు భూములు, వాగులు, వంకలు, కొండలు, గుట్టలకు పట్టాలు ఇవ్వరు. వ్యవసాయయోగ్యమైన భూమిని మాత్రమే అసైన్డ్ చేస్తూ డీ–పట్టా ఇస్తారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని రెవెన్యూ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

రెవెన్యూ డివిజన్ వారీగా వివరాలు

రెవెన్యూ డివిజన్	లబ్ధి పొందే రైతులు	పంపిణీ చేసే భూమి (ఎకరాల్లో)
అనంతపురం	359	512.81
గుంతకల్లు	536	646.32
కళ్యాణదుర్గం	336	510.95
మొత్తం	1,231	1,670.08

ప్రక్రియ పూర్తి చేశాం



జిల్లాలో భూ పంపిణీకి అవసరమైన ప్రక్రియ పూర్తయ్యింది. 1,231 మంది రైతులు 1,670.08 ఎకరాల ప్రభుత్వ భూమిని సాగు చేస్తున్నట్లు గుర్తించాం. ఆ మేరకు లబ్ధిదారుల జాబితా సిద్ధమయ్యింది. ఇందుకు సంబంధించి వెబ్‌ల్యాండ్ కరెక్షన్ కూడా పూర్తయ్యింది. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే సాగు హక్కు పట్టాల పంపిణీ చేపడతాం.

– కేతన్‌గార్గ్, జాయింట్ కలెక్టర్

గంజాయి విక్రేతలకు 4 నెలల జైలు

అనంతపురం: గంజాయి విక్రయిస్తూ పట్టుబడిన కేసులో ముగ్గురు ముద్దాయిలకు నాలుగు నెలల జైలు శిక్ష విధిస్తూ అదనపు జిల్లా జడ్జి, ఫ్యామిలీ కోర్టు జడ్జి టి.హరిత మంగళవారం తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. 2020 డిసెంబర్ 21న పుట్టపర్తిలోని సాయినగర్‌లో గంజాయి విక్రయిస్తున్న శ్రీనివాసులు, హర్షవర్ధన్, రమేష్‌లను అప్పటి అర్బన్ సీఐ వెంకటేశ్‌నాయక్ తన సిబ్బందితో అరెస్టు చేశారు. విచారణ అనంతరం చార్జ్‌షీటు దాఖలు చేశారు. అనంతపురంలోని ఒకటో అదనపు జిల్లా జడ్జి, ఫ్యామిలీ కోర్టులో విచారణ జరిగింది. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పీపీ లక్ష్మీనారాయణరెడ్డి ఐదుగురు సాక్షులను విచారించారు. ఇరువర్గాల వాదనలు, కేసు పూర్వాపరాలు పరిశీలించిన మీదట నేరం రుజువు కావడంతో ముద్దాయిలు శ్రీనివాసులు, హర్షవర్ధన్, రమేష్‌లకు నాలుగు నెలల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.1000 జరిమానా విధిస్తూ జడ్జి టి.హరిత మంగళవారం తీర్పు చెప్పారు.

పుస్తకం.. భవితకు మార్గనిర్దేశనం



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే అనంత, మేయర్ వసీం, ఉమాదేవి తదితరులు

అనంతపురం: మంచి పుస్తకం మన భవితకు మార్గనిర్దేశనంగా దోహదపడుతుందని ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి అన్నారు. అనంతపురంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో మంగళవారం బాలల దినోత్సవంతో పాటు 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ ఒక్కరూ చదువుకునేందుకు ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన పథకాలను తీసుకొచ్చినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ బాగా చదువుకోవాలని సూచించారు. గ్రంథాలయ అభివృద్ధికి చైర్‌పర్సన్ ఉమాదేవి ఎంతో శ్రమిస్తున్నారని అభినందించారు. అనంతరం గ్రంథాలయ వారోత్సవ ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ ఉమాదేవితో పాటు మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎల్ఎం మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- విస్తరిస్తున్న టీ స్టాళ్లు, కేఫ్‌లు
- ఏ వీధిలో చూసినా కొట్లు
- నగర, పట్టణ శివారులో పెద్దపెద్ద కేఫ్‌లు
- పలు సౌకర్యాలతో విశాల ప్రదేశాల్లో ఏర్పాటు
- కావాల్సినంత సేపు సేదతీరుతూ ఆస్వాదిస్తున్న జనం

ఏమిటీ ఒరవడి!



ఒకప్పుడు టీ తాగడమనేది చాలా చిన్న విషయం. ఏ చిన్న కొట్టు దగ్గరికో వెళ్లి.. అర్జెంటుగా టీ తాగి వెంటనే కప్పు అక్కడ పెట్టి వచ్చిన దారిన వెళ్లిపోయేవారు. అయితే, కాలం మారింది. పద్ధతులూ మారాయి. అన్నింటా ఎం'జాయ్' కోరుకుంటున్న జనం టీ సేవనమూ అదే రీతిలో ఉండాలని భావిస్తున్నారు. వారి అభిరుచులకు అనుగుణంగా టీ కొట్లూ మారిపోయాయి. ఆధునిక హంగులు సంతరించుకున్నాయి.

ఉమ్మడి జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో టీస్టాళ్లు/కేఫ్‌ల సంఖ్య (సుమారుగా)	
అనంతపురం	2,000
తాడిపత్రి	600
గుంతకల్లు	400
రాయదుర్గం	200
ధర్మవరం	600
హిందూపురం	400
కదిరి	400



అనంతపురం శివారులోని ఓ టీ కేఫ్

సాక్షి, అనంతపురం డెస్కు: అనంతపురం నగరంలో ఒకప్పుడు టీ తాగాలంటే ఎక్కడ దొరుకుతుందా అని వెతకాల్సిన పరిస్థితి. కానీ, నేడు అలా కాదు. ప్రతి ఏరియాలోనూ టీ కేఫ్‌లు ఏర్పాటయ్యాయి. అదీ విశాల ప్రాంగణాల్లో. శివారు ప్రాంతాల్లో అయితే ఆధునిక హంగులతో పెద్దపెద్ద కేఫ్‌లు జనాన్ని ఆకర్షిస్తున్నాయి. తీరిగ్గా కూర్చొని.. అలా కబుర్లు చెప్పుకుంటూ టీ/కాఫీ తాగేందుకు వీలుగా ఏర్పాట్లు ఉంటున్నాయి. ఉదయం, సాయంత్రం సమయాల్లో వీటి వద్ద రద్దీ ఎక్కువగా కన్పిస్తోంది. ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు, సాధారణ ప్రజలు సైతం ఖాళీ సమయం దొరికితే చాలు కేఫ్‌ల బాట పడుతున్నారు. కొన్ని కేఫ్‌ల వద్ద కార్లు, బైకుల రద్దీని చూస్తే ఏమి'టీ' మార్పు అని ఆశ్చర్యం కలగకమానదు. ప్రస్తుతం వరల్డ్‌కప్ క్రికెట్ సీజన్ నడుస్తుండడంతో కేఫ్‌లు మరింత రద్దీగా మారాయి. ఒక్క అనంతపురం నగరంలోనే కాకుండా..ఉమ్మడి అనంతపురం జిల్లాలోని రాయదుర్గం, తాడిపత్రి, గుంతకల్లు, ధర్మవరం, హిందూపురం, కదిరి తదితర పట్టణ ప్రాంతాలు, చివరకు మండల కేంద్రాల్లో సైతం టీ కేఫ్‌ల సంస్కృతి విస్తరిస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టీస్టాళ్లు, కేఫ్‌లు కలిపి ఎనిమిది వేలకు పైగా ఉన్నట్లు అంచనా.

అభిరుచికి అనుగుణంగా..

ఒకప్పుడు టీ, కాఫీ అంటే ఆయా పొడులతో చేసేవే ఉండేవి. కానీ, నేడు వాటిలోనూ వివిధ రకాలు లభిస్తున్నాయి. సాధారణ టీతో పాటు అల్లం టీ, గ్రీన్ టీ, ఇరానీ ఛాయ్, పెప్పర్‌మెంట్ టీ, మసాలా టీ, లెమన్ టీ, లావెండర్ టీ.. ఇలా పలు రకాలు విభిన్న రుచుల్లో లభ్యమవుతున్నాయి. టీ మాత్రమే కాకుండా వివిధ రకాల కాఫీలు, రాగిమాల్ట్ వంటివి కూడా అందుబాటులో ఉంటున్నాయి. జనాన్ని ఆకర్షించేందుకు ఆయా దుకాణదారులు కొత్తదారులు అన్వేషిస్తున్నారు. ఫ్రీ వైఫై అంటూ యువతను ఆకర్షిస్తున్నారు. పెద్ద పెద్ద టీవీలు ఏర్పాటు చేస్తున్నారు. ఆకట్టుకునేలా కుర్చీలు ఉంచుతున్నారు. టీ/కాఫీ అందించే కప్పులూ విభిన్నంగా ఉంటున్నాయి.



అనంతపురం శివారులో రద్దీగా ఉన్న ఓ టీ కేఫ్

బ్రాండ్‌లూ వచ్చేశాయి!

టీ కేఫ్‌లకు లభిస్తున్న ఆదరణ చూసి కొందరు వాటినీ 'బ్రాండ్'లుగా మార్చేస్తున్నారు. 'ఫ్రాంచైజీలు' ఇస్తూ చక్కగా సొమ్ము చేసుకుంటున్నారు. వారు నిర్దేశించిన మొత్తం చెల్లిస్తే ఔట్‌లెట్ డిజైన్ చేయించడంతో పాటు వివిధ రకాల టీలు, కాఫీలు తయారుచేయడానికి వీలుగా మెటీరియల్ సరఫరా చేస్తున్నారు. వాటి తయారీలో ప్రత్యేక శిక్షణ కూడా ఇప్పిస్తున్నారు. ఇలాంటి బ్రాండ్ కేఫ్‌లు ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వెలిశాయి. మరీ ముఖ్యంగా జాతీయ రహదారుల పక్కన ఎక్కువగా దర్శనమిస్తున్నాయి.

'ఉపాధి' మార్గం

చాలామంది ప్రత్యామ్నాయ ఉపాధి మార్గంగా టీ కేఫ్‌లను ఎంచుకుంటున్నారు. తక్కువ పెట్టుబడి వ్యయం, మంచి మాస్టర్లు దొరికితే నిర్వహణ సులువు కావడం, ఆదాయం కూడా తగినంతగా ఉండడంతో ఇటువైపు మొగ్గు చూపుతున్నారు. ఇందులోనూ యువత ఎక్కువగా ఉంటున్నారు. చదువుకుంటూ, ఉద్యోగం చేస్తూ ప్రత్యామ్నాయ ఆదాయం కోసం టీ కేఫ్‌లు నిర్వహించే వారూ ఉన్నారు.

'చర్చా'వేదికలు

కేఫ్‌లు కేవలం పిచ్చాపాటి కబుర్లతో టీ, కాఫీ సేవనానికే పరిమితం కాలేదు. 'చర్చా'వేదికలుగానూ మారాయి. ఇక్కడ రాజకీయ చర్చలు వేడీవేడిగా సాగుతుంటాయి. రియల్ ఎస్టేట్ లావాదేవీలు నడుస్తుంటాయి. ఉద్యోగ సంబంధ కార్యకలాపాలూ జరుగుతుంటాయి. పెళ్లి సంబంధాలూ కుదిరిపోతుంటాయి. ఇలా ఒకటేమిటి అనేక వ్యవహారాలకు టీ కేఫ్‌లు అడ్డాగా మారాయి.

టీ కేఫ్ జీవనాధారం



ఇంటర్ చదువుతున్నప్పుడు ఓ టీ కేఫ్‌లో వర్కరుగా పని చేసేవాణ్ని. అదే కేఫ్‌నకు ఓనర్‌గా ఎదిగా. ఇది నా కుటుంబానికి జీవనాధారంగా మారింది. పలు రకాల టీ తయారు చేస్తున్నా. ఆశించిన స్థాయిలో వ్యాపారం అవుతోంది. ఉపాధికి ఢోకా లేదు. నాన్న కూడా నాకు సహాయంగా ఉంటున్నారు.

– ధనుంజయ, టీ కేఫ్ నిర్వాహకుడు, రాయదుర్గం

స్నేహం బలపడే వేదిక



టీ కేఫ్‌లు స్నేహం బలపడే వేదికలనడంలో అతిశయోక్తి లేదు. కాలేజీకి బంక్ కొట్టినా.. లేదా తోటి స్నేహితులందరం కలుసుకునేందుకు అడ్డాగా టీ కేఫ్‌లే ఉంటున్నాయన్నది వాస్తవం. ఇక్కడే కొత్త స్నేహాలు కూడా చిగురిస్తున్నాయి. ఉద్యోగులు, విద్యార్థులు, సాధారణ ప్రజలు తీరిక సమయాల్లో కేఫ్‌లలో కాలక్షేపం చేస్తూ ప్రపంచం గురించి చర్చించుకుంటుంటారు.

– కార్తీక్, డిగ్రీ విద్యార్థి, తాడిపత్రి

ఆదరణ పెరుగుతోంది



ప్రతి విషయాన్ని చర్చించుకోవడంతో పాటు ప్రపంచంలోని విషయాలన్నింటిపై మాట్లాడుకునేందుకు గతంలో రచ్చబండలు వేదికగా ఉండేవి. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఇద్దరి నుంచి పదుల సంఖ్యలో కూడుకుని మాట్లాడేందుకు వేదికగా టీ కేఫ్‌లు మారాయి. ఫలితంగా వీటికి ఆదరణ నానాటికీ పెరిగిపోతోంది. ఈ వ్యాపారంపై చాలా మంది యువత సైతం ఆసక్తి చూపుతున్నారు.

– రవి, టీ మాస్టర్, తాడిపత్రి

మిత్రులతో మాట్లాడే అవకాశం



టీ తాగడానికి బాగా అలవాటు పడ్డాం. గతంతో పోలిస్తే ఇప్పుడు నగరంలో చాలా టీ స్టాల్స్, కేఫ్‌లు వెలిశాయి. మిత్రులతో కలసి ఛాయ్ తాగి కాసేపు కబుర్లు చెప్పుకునేందుకు కేఫ్‌లు వేదికగా మారాయి.

– సూర్యనారాయణ, రెవెన్యూ కాలనీ, అనంతపురం

బైపాస్ నిర్మాణానికి భూసేకరణ వేగవంతం



మ్యాప్‌ను పరిశీలిస్తున్న జేసీ కేతన్ గార్గ్

రాయదుర్గం రూరల్: మండలంలోని 74 ఉడేగోళం వద్ద ఉన్న వైఎస్సార్ క్రాస్ నుంచి కణేకల్లు రోడ్డు మీదుగా బళ్లారి రోడ్డును కలుపుతూ నిర్మించ తలపెట్టిన బైపాస్‌కు భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రెవెన్యూ అధికారులను జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం అవసరమైన భూములను ఆర్డీఓ రాణి సుస్మితతో కలసి మంగళవారం ఆయన పరిశీలించారు. బైపాస్ నిర్మాణం పూర్తయితే పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తీరుతాయన్నారు. ఆర్అండ్‌బీ డీఈ రవిశంకర్‌రెడ్డి, తహసీల్దార్ ఓబులేసు పాల్గొన్నారు.

పారని 'కాలవ' కుతంత్రం

- అక్రమంగా క్వారీ లీజులు పొందేందుకు టీడీపీ నాయకుల కుట్ర
- గ్రామస్తులకు తెలియకుండానే ప్రజాభిప్రాయ సేకరణకు రంగం సిద్ధం
- సమావేశాన్ని అడ్డుకున్న స్థానికులు
- వాయిదా వేసిన జాయింట్ కలెక్టర్



జేసీ కేతన్‌గార్గ్‌కు వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్ పరమేశ్వర, తదితరులు

రాయదుర్గం: బొమ్మనహాళ్ మండలం నేమకల్లు వద్ద స్టోన్ క్వారీలకు లీజు దక్కించుకునే విషయంలో ప్రజాతంత్రం ముందు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు, అతని ప్రధాన అనుచరులు పన్నిన కుతంత్రం వీగిపోయింది. 2014–19 మధ్య కాలంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని యథేచ్ఛగా దోపిడీ పర్వం కొనసాగించిన టీడీపీ నేతలకు ప్రజావ్యతిరేకత చెంపపెట్టుగా మారింది. అప్పట్లో నేమకల్లు పరిసరాల్లో ఏర్పాటైన 24 క్వారీలు, స్టోన్ క్రషర్లలో 23 వరకూ టీడీపీ అనుయాయులే దక్కించుకున్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపట్టి, ప్రభుత్వానికి రాయల్టీ ఎగ్గొట్టి రూ.కోట్లు కొల్లగొట్టారు. దాదాపు రూ.100 కోట్ల రాయల్టీ బకాయిలు చెల్లించకుండా ఇప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వస్తున్నారు. ఆ సొమ్ము చెల్లించకుండానే తిరిగి బినామీ పేర్లతో అక్రమంగా టెండర్లు దక్కించుకునే కుతంత్రాన్ని స్థానికులు సమర్థవంతంగా తిప్పికొట్టారు.

లోగుట్టుగా ప్రజాభిప్రాయ సేకరణ సభ

నేమకల్లు వద్ద సర్వే నంబర్ 253లో మొత్తం 7.080 హెక్టార్ల విస్తీర్ణంలో రోడ్డు మెటల్, బిల్డింగ్ స్టోన్ క్వారీల ఏర్పాటుకు మంగళవారం జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయసేకరణ చేపట్టారు. కార్యక్రమానికి కాలుష్య నియంత్రణ మండలి, రెవెన్యూ, పోలీసు, మైనింగ్ శాఖల అధికారులు హాజరయ్యారు. అయితే సభ నిర్వహణపై స్థానికులకు ఎలాంటి సమాచారం లేదు. కనీసం గ్రామ సర్పంచ్ పరమేశ్వరకు సైతం ఈ విషయం తెలియదు. సభకు స్థానికుల కంటే టీడీపీ నాయకులు, కార్యకర్తలే ఎక్కువ మంది హాజరయ్యారు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు, గ్రామ సర్పంచ్ పరమేశ్వర, ఎంపీటీసీ సభ్యుడు చిక్కన్న అక్కడకు చేరుకుని అధికారులను నిలదీశారు. ప్రజలకు తెలియకుండా ప్రజాభిప్రాయ సేకరణ ఎలా చేపడతారని ప్రశ్నించారు. సభకు స్థానికులను రానివ్వకుండా టీడీపీ నాయకులే ఎక్కువగా పోగు చేసినట్లుగా ఉందన్నారు. లోగుట్టుగా ఈ ప్రక్రియ నిర్వహించడం సబబు కాదని, భారత పర్యావరణం, అడవులు, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ జారీ చేసిన నిబంధనలకు విరుద్ధంగా ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడం సరైంది కాదని హితవుపలికారు. ప్రజామోదం మేరకే క్వారీల లీజుకు అనుమతులు ఇవ్వాలని రాతపూర్వకంగా జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. పేరుకుపోయిన సుమారు రూ.100 కోట్ల రాయల్టీ బకాయిలు చెల్లించాకే టెండర్లు నిర్వహించాలని సూచించారు.

పట్టుబట్టిన టీడీపీ నాయకులు

సభకు హాజరైంది స్థానికులేనని ఎలాగైనా ప్రజాభిప్రాయ సేకరణ ప్రక్రియ ముందుకు కొనసాగించాలని టెండర్‌దారులైన టీడీపీ నాయకులు పట్టుబట్టారు. దీంతో గ్రామస్తులకు, టీడీపీ నాయకుల మధ్య వాగ్వాదం చెలరేగింది. చివరగా సర్పంచ్‌తో పాటు స్థానికుల అభిప్రాయానికే జేసీ పెద్దపీట వేస్తూ ప్రజాభిప్రాయ సేకరణను వాయిదా వేశారు. తదుపరి తేదీని త్వరలో వెల్లడిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో ఏపీపీసీబీ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పీవీ కిషోర్‌రెడ్డి, ఏఈఈ కృష్ణారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్‌ఐ శివ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నెహ్రూ సేవలు మరువలేనివి



సాంస్కృతిక ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులు

అనంతపురం క్రైం: దేశ మాజీ ప్రధాని, దివంగత పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ సేవలు మరువలేనివని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ అన్నారు. నెహ్రూ జయంతిని పురస్కరించుకుని స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పోలీస్ రక్షక్ ప్రీ ప్రైమరీ స్కూలు విద్యార్థులకు ఎస్పీ తొలుత బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చాక్లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. వ్యాస రచన, క్విజ్ పోటీల్లో ప్రతిభ చూపిన చిన్నారులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు విజయభాస్కర రెడ్డి, జి.రామకృష్ణ, ఎ.హనుమంతు, ఏఆర్ డీఎస్పీ మునిరాజు, ఆర్ఐ రాముడు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు, పోలీస్ రక్షక్ ప్రీ ప్రైమరీ స్కూలు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హనుమద్ దీక్షలు ప్రారంభం

గుంతకల్లు రూరల్: మాలను ధరించి దీక్ష చేపట్టేవారు నియమనిష్టలతో మండల దీక్షను పూర్తి చేయాలని హనుమద్ మాలధారులకు కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం వేద పండితులు సూచించారు. మంగళవారం ఆలయంలో హనుమద్ వ్రత మండల దీక్షలు ప్రారంభం అయ్యాయి. వేకువజామునే ఆలయానికి చేరుకున్న వందలాది మంది భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించి వేదపండితులు, అర్చకుల చేతుల మీదుగా మాలను ధరించారు.

టీడీపీ సర్పంచ్ దౌర్జన్యం



ఆర్డీఓ డాక్టర్ రాణి సుస్మితకు వినతి పత్రం ఇస్తున్న గ్రామస్తులు

కళ్యాణదుర్గం: తమ పొలాలకు దారి (రస్తా) ఇవ్వకుండా సర్పంచ్ వేధిస్తున్నాడంటూ ఆర్డీఓ డాక్టర్ రాణి సుస్మితకు కుందుర్పి మండలం తూముకుంట గ్రామానికి చెందిన పలువురు రైతులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం ఆర్డీఓను ఆమె చాంబర్‌లో కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి గోపాల్ మాట్లాడుతూ.. సర్వే నంబర్ 86–6లోని రైతులు తమ భూమిలోకి వెళ్లేందుకు పూర్వీకుల కాలం నుంచి ఆ గ్రామ ప్రస్తుత సర్పంచ్ (టీడీపీ) రామాంజినేయులు పొలం మీదుగా రస్తా ఉంది. అయితే ఇటీవల రైతులను ఆ మార్గంలో వెళ్లకుండా రామాంజినేయులు అడ్డు వేశాడు. గతంలోనూ ఇదే తరహాలో అడ్డు కట్ట వేయడంతో విషయాన్ని అప్పటి ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళితే పోలీసు రక్షణతో రస్తా ఇప్పించారు. తాజాగా మరోసారి సర్పంచ్ దౌర్జన్యంగా రస్తాకు అడ్డుకట్ట వేయడంతో పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించలేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. సర్పంచ్ రామాంజినేయులపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని రైతులు కోరారు. స్పందించిన ఆర్డీఓ రెండు, మూడు రోజుల్లో సమస్యకు పరిష్కారం చూపుతానని హామీ నివ్వడంతో రైతులు వెనుదిరిగారు.

అవాస్తవాలు ప్రచురిస్తే చట్టపరమైన చర్యలు

- ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం: పత్రికలలో అవాస్త కథనాలు ప్రచురిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా పోలీసు శాఖ ప్రతిష్టను దెబ్బతీసేలా ప్రచురితమైన (సాక్షి కాదు) కథనంపై ఆయన స్పందించారు. జిల్లా పోలీసు శాఖకు సంబంధించిన వాహనాలు, వాటి నిర్వహణ ఏఆర్ విభాగం ఉన్నతాధికారి పర్యవేక్షణలో కొనసాగుతాయన్నారు. అంతేకాక ప్రతి నెలా పోలీసు మోటార్ ట్రాన్స్‌పోర్ట్ విభాగానికి సంబంధించిన వాహనాల కండీషన్‌పై ఎంవీఐతో తనిఖీ చేయించి ఆ నివేదికను రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులకు పంపిస్తారన్నారు. ఈ వాస్తవాలు తెలుసుకోకుండా తప్పుడు కథనాలు ప్రచురించడం సరి కాదన్నారు. ఒకటికి రెండు సార్లు పరిశీలించుకుని వాస్తవాలను నిర్ధారించుకున్న తర్వాత సంబంధిత విభాగపు అధికారుల వివరణతో కూడిన కథనాలు ప్రచురించడం జర్నలిజంలోని ప్రాథమిక సిద్ధాంతమన్నారు. ఇందుకు విరుద్ధంగా సోషల్ మీడియాలోని అంశాలు వైరల్ చేయడం వల్ల వర్గ వైషమ్యాలు, రాజకీయ గొడవలు, సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతున్నాయన్నారు. అవాస్తవాలు, తప్పుడు కథనాలు వ్యాప్తి చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

దగాకోరులను వదలొద్దు : ఎస్పీ

ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొనుగోలు చేసి డబ్బులివ్వకుండా నెలల తరబడి తప్పించుకు తిరుగుతున్నా వ్యాపారులు ఎంతటి వారైనా సహించబోమని ఎస్పీ అన్బురాజన్ హెచ్చరించారు. ఉరవకొండ, బెళుగుప్ప మండలాల్లో రైతులు సాగు చేసిన పప్పుశనగను కొందరు వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి కొనుగోలు చేసి దాదాపు రూ.15 కోట్ల మేర రైతులకు చెల్లించకుండా మోసం చేశారు. దీనిపై బాధిత రైతులు మంగళవారం ఎస్పీని ఆశ్రయించడంతో రైతులను మోసం చేసిన దగాకోరులను తక్షణమే అరెస్ట్ చేసి ప్రతి పైసా వసూలు చేయాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు.

జేఎన్‌టీయూ ప్రొఫెసర్ ప్రశాంతి ఆవిష్కరణకు పేటెంట్

- మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో వాహనాల బ్రేక్‌ల రూపకల్పన



ప్రొఫెసర్ జి. ప్రశాంతిని సన్మానిస్తున్న జేఎన్‌టీయూ వీసీ డాక్టర్ జింకా రంగజనార్దన

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) క్యాంపస్ కళాశాల మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ జి.ప్రశాంతి పరిశోధనకు పేటెంట్ దక్కింది. ప్రొఫెసర్ జి.ప్రశాంతి, పరిశోధన విద్యార్థి ఎం.శివసూర్య సంయుక్తంగా 'ఏ న్యూ మెథడ్ టు ఫ్యాబ్రికేట్ డిఫరెంట్ లేయర్డ్ ఎల్ 7075/ఎస్ఐసీ ఫంక్షనల్లీ గ్రేడ్ మెటీరియల్స్ యూసింగ్ పవర్ మెటాలార్జీ టెక్నిక్' అంశంపై చేసిన పరిశోధనకు గాను పేటెంట్ దక్కింది. ఈ పరిశోధన ముఖ్యంగా వాహనాల బ్రేక్ కాంటాక్ట్‌కి సంబంధించినది కావడం గమనార్హం. తక్కువ ఖర్చుతో ఎక్కువ మన్నిక వచ్చేలా అల్యూమినియం (ఏఎల్ 7075)/ఎస్ఐసీ మెటీరియల్‌ను ఉపయోగించి పౌడర్ మెటలర్జీ ప్రోడక్ట్‌కు రూపకల్పన చేశారు. వివిధ రకాల మందమైన మెటీరియల్‌ను ఉపయోగించి బ్రేక్ కాంటాక్టు బలాన్ని పరీక్షించారు. వీటిలో 10 ఎం.ఎం. మందంతో గల బ్రేక్ సత్ఫలితాలను ఇచ్చింది. 2021, మార్చి నెలలో పేటెంట్‌కు దరఖాస్తు చేసుకోగా, ఈ నెల 14న పేటెంట్ గ్రాంట్ అయినట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జి. ప్రశాంతి కృషికి ప్రశంసలు దక్కాయి. ఆమెను జేఎన్‌టీయూ (ఏ) వీసీ డాక్టర్ జింకా రంగజనార్దన, రిజిస్ట్రార్ సి.శశిధర్, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ.కేశవరెడ్డి, ప్రొఫెసర్ పి.సుజాత, ప్రొఫెసర్ ఎస్.వివాలి, ప్రొఫెసర్ ఎ.సురేష్ బాబు, పాలకమండలి సభ్యుడు డాక్టర్ ఎం.రామశేఖరరెడ్డి, డాక్టర్ ఎస్.చంద్రమోహన్‌రెడ్డి తదితరులు అభినందించారు.

సహకార వ్యవస్థ బలోపేతానికి కృషి

- వారోత్సవాల్లో డీసీసీబీ చైర్‌పర్సన్ లిఖిత



మాట్లాడుతున్న లిఖిత

అనంతపురం అగ్రికల్చర్: సహకార వ్యవస్థ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్‌పర్సన్ ఎం.లిఖిత పిలుపునిచ్చారు. స్థానిక డీసీసీబీ హాలులో 70వ అఖిల భారత సహకార వారోత్సవాలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. సహకార పతాకాన్ని ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేయించారు. 'భారత దేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో సహకార సంఘాల పాత్ర' అంశంపై చైర్‌పర్సన్ మాట్లాడుతూ... సహకార రంగం ఆవిర్భావం, విశిష్టత, సహకార సూత్రాలు, సహకార రంగం బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. సహకార బ్యాంకుల ద్వారా రైతులు, ఇతర అన్ని వర్గాలకూ అందిస్తున్న బ్యాంకింగ్ సేవలు, రుణాలపై ప్రజలను చైతన్య పరచాలన్నారు. భావితరాలకు, సమాజాభివృద్ధికి సహకార వ్యవస్థను పటిష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో జిల్లా సహకార అధికారి (డీసీఓ) ఎం.ప్రభాకరరెడ్డి, నాబార్డు డీడీఎం అనురాధ, బ్యాంకు సీఈఓ ఏబీ రామ్‌ప్రసాద్, జీఎం కె.సురేఖారాణి, డైరెక్టర్ వై.జనార్దన్ రెడ్డి, రాయలసీమ సహకార శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసులు, సహకార ఆడిట్ అధికారి నాగరాజు పాల్గొన్నారు. కాగా, ఈ నెల 20వ తేదీ వరకూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ అంశాలపై వారోత్సవాలు కొనసాగనున్నాయి.

క్లుప్తంగా

ప్రశ్నార్థకంగా సీసీ కెమెరాల ఏర్పాటు



ఆస్పత్రిలో పని చేయని సీసీ కెమెరాలు

అనంతపురం కార్పొరేషన్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో సీసీ కెమెరా మరమ్మతు పనులు ప్రశ్నార్థకంగా మారాయి. నెల రోజుల క్రితమే పనులు ప్రారంభమైనా, నేటికీ సంబంధిత కాంట్రాక్టర్ పనులు పూర్తి చేయించలేదు. అత్యంత కీలకమైన సీసీ కెమెరాల ఏర్పాటును అటు ఏపీఎంఎస్ఐడీసీ ఇంజినీర్లు, ఇటు జీజీహెచ్ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇదిలా ఉండగా ఆస్పత్రిలోని సర్జికల్ వార్డు వద్ద ఉన్న ఆరోగ్యశ్రీ కార్యాలయం వద్ద ఉన్న సీసీ కెమెరా లైన్‌ను కొందరు తొలగించారు. వారంలోపు పూర్తి చేయాల్సిన పనులు నెలలు గడుస్తున్నా పూర్తి చేయలేదు. గైనిక్, లేబర్, చిన్నపిల్లల వార్డులో సీసీ కెమెరాలు ఏర్పాటు అత్యవసరం. ప్రభుత్వం రూ.3.5 కోట్లు ఆస్పత్రిలోని వివిధ మరమ్మతు, పునరుద్ధరణ పనులకు కేటాయించిన విషయం విదితమే. జిల్లా కలెక్టర్ చొరవతీసుకుంటేనే అధికారులు పనిచేసే పరిస్థితి ఉందని ఆస్పత్రి సిబ్బంది అంటున్నారు.

ఆసక్తికంగా అన్నకూటోత్సవం



అన్నకూట ఉత్సవాన్ని నిర్వహిస్తున్న దామోదర గౌరంగదాసు

అనంతపురం కల్చరల్: ఇస్కాన్ మందిరం గోవర్ధన పూజలతో కళకళలాడింది. మంగళవారం రాత్రి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తుల నడుమ ఇస్కాన్ జిల్లా ఇన్‌చార్జ్ దామోదర గౌరంగదాసు రాధా పార్థసారథులకు నివేదించిన 60 రకాల వంటకాలకు అన్న కూటోత్సవ పూజలు నిర్వహించారు. విజిలెన్సు ఎస్పీ మునిరామయ్య ఆత్మీయ అతిథిగా హాజరై, స్వామిని దర్శించుకున్నారు. దామోదర గౌరంగదాసు ప్రవచనంలో గోవర్ధన గిరి ప్రాశస్త్యాన్ని, గోపూజల ప్రాముఖ్యతను తెలియజేశారు.

సోలార్ గీజర్ల అందజేత



సోలార్ గీజర్లను ప్రారంభిస్తున్న దృశ్యం

అనంతపురం క్రైం: అనంతపురంలోని బాల సదన్‌కు రెండు సోలార్ గీజర్లను దాతల సహకారంతో పోలీసులు అందజేశారు. మంగళవారం బాలల దినోత్సవం పురస్కరించుకుని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు బాల సదన్ బాలల దినోత్సవం నిర్వహించారు. అదనపు ఎస్పీ విజయభాస్కర్ రెడ్డి పాల్గొని జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం బాల సదన్ సంరక్షణలో ఉంటున్న 22 మంది పిల్లలతో ముచ్చటించారు. నూతన దుస్తులు, స్వెట్టర్లు, స్వీట్లు పంచి పెట్టారు. దాతలు ఆదిరెడ్డి, జాఫర్, వెంకటేశ్వర్లు, కుమార్‌ల సహకారంతో 2 సోలార్ గీజర్లను బాల సదన్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, దివ్యశ్రీ ఆసుపత్రి డాక్టర్ రాంమోహన్, డీసీఆర్బీ సీఐ విశ్వనాథచౌదరి, నెహ్రూ యువ కేంద్ర ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీనివాసులు, శ్రీకాంత్ క్యాటరర్స్ రమణ, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పురోగతితోనే దేశాభివృద్ధి



జేఎన్‌టీయూ అనంతపురంలో నెహ్రూ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన



జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి జి.దీన



ఎస్కేయూలోని ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య

అనంతపురం: సాంకేతిక పురోగతితోనే దేశాభివృద్ధి సాధ్యమని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ భావించి అందుకు పునాదులు వేశారని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన అన్నారు. మంగళవారం జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని జేఎన్‌టీయూ క్యాంపస్‌లోని నెహ్రూ విగ్రహానికి నివాళి అర్పించారు. అనంతరం పాలక భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీసీ మాట్లాడారు. దేశ తొలి ప్రధానిగా ఆయన చేసిన సేవలు గుర్తు చేశారు. నెహ్రూ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. ఆయనలోని విశిష్ట వ్యక్తిత్వం, సమయపాలన, అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, ఎవాల్యుయేషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఈ. కేశవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- ఎస్కేయూలోని ఇంజినీరింగ్ కళాశాలలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రామచంద్ర, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏ కృష్ణ కుమారి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సోమశేఖర్ తదితరులు నెహ్రూ చిత్రపటానికి నివాళి అర్పించారు. ఎస్కేయూ ఇంజినీరింగ్ కళాశాలలో నెహ్రూ జయంతి నిర్వహించారు.
- జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నెహ్రూ జయంతి కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జి జి. దీన ముఖ్య అతిథిగా హాజరై నివాళి అర్పించారు. నెహ్రూ జీవిత ఘట్టాలతో పాటు చిన్నారులు తెలుసుకోవాల్సిన అంశాలను జడ్జి వివరించారు. కార్యక్రమంలో రెడ్స్ సంస్థ ప్రతినిధి శిరీష, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆర్డీటీ ఆర్ట్ ఫెస్టివల్

అనంతపురం: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఆర్డీటీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఆర్ట్ ఫెస్టివల్ ఆకట్టుకుంది. కార్యక్రమాన్ని ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛోఫెర్రర్ ప్రారంభించి, ప్రసంగించారు. పిల్లల్లో సృజనాత్మకత నైపుణ్యాలను పెంపొందించేందుకు గత 40 ఏళ్లుగా ఆర్ట్ ఫెస్టివల్‌ను విజయవంతంగా నిర్వహిస్తూ వస్తున్నట్లు గుర్తు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఈ ఏడాది ఆరు అంశాలపై పోటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని 41 ప్రాంతాల నుంచి తరలివచ్చిన 246 మంది బాలబాలికలకు చేతిరాత, రంగోళి, చిత్రలేఖనం, ఒరిగామి ఆర్ట్ వర్క్, న్యాచురల్ కొలేజ్, మట్టితో బొమ్మల తయారీ (క్లే ఆర్ట్) పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలను ఆర్డీటీ మహిళా సాధికారత డైరెక్టర్ విశాల ఫెర్రర్, ఎడ్యుకేషన్ డైరెక్టర్ మోహన్‌మురళి, స్పానిష్‌కు చెందిన ఆర్డీటీ ప్రతినిధులు అభినందిస్తూ బహుమతులు ప్రదానం చేశారు.

ఉత్సాహంగా బాలల దినోత్సవం

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని వివిధ పాఠశాలల్లో మంగళవారం బాలల దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. ముందుగా నెహ్రూ చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. అనంతరం చిన్నారులకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. బాలల దినోత్సవ ప్రాముఖ్యతను కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.

అనంతపురం రూరల్: నేటి బాలలే రేపటి పౌరులని, విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలని సీఆర్ఐటీ విద్యా సంస్థల చైర్మన్ చిరంజీవిరెడ్డి అన్నారు. మంగళవారం ఎరా ఇంటర్నేషనల్ స్కూల్ లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ అరుణ్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి, సిబ్బంది దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: నేటి బాలలే రేపటి పౌరులు అని తహసీల్దార్ షర్మిల, ఎంపీపీ హేమలత తెలిపారు. మంగళవారం మండల వ్యాప్తంగా బాలల దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలల దినోత్సవం నిర్వహించారు. ఆత్మకూరు ఎంపీడీఓ కార్యాలయంలో తహసీల్దార్ షర్మిల, ఎంపీపీ హేమలత, ఎంపీడీఓ రఘునాథ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లావణ్య, శ్రీవాణి ఆధ్వర్యంలో బాలల దినోత్సవం జరిపారు. కేజీబీవీలో బాలల దినోత్సవం జరిపారు.

క్యాంపస్ స్కూల్‌లో బాలల దినోత్సవం

అనంతపురం: శ్రీకృష్ణ దేవరాయ విశ్వ విద్యాలయం క్యాంపస్ స్కూల్‌లో నెహ్రూ జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర యూనివర్సిటీల కమిటీ యనమల ప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్కేయూ క్యాంపస్ స్కూల్ విద్యార్థులకు క్యారం బోర్డులు బహుకరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశులు, ఉమాపతి, రెడ్డప్ప, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో...

అనంతపురం టవర్‌క్లాక్: విద్య,వైద్య రంగాలు,నీటి ప్రాజెక్టులను అభివృద్ధి చేసిన గొప్ప వ్యక్తి జవహర్‌లాల్ నెహ్రూ అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ అధ్యక్షుడు దాదాగాంధీ అన్నారు. మంగళవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నెహ్రూ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గాజుల వాసు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమాం, ఓబీసీ చైర్మన్ రామ్‌చరణ్, యాదవ్ మైనార్టీ నగర అధ్యక్షులు శర్మాస్‌వలి, రవి, మురళి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ విజ్ఞానం నెహ్రూతోనే ఆరంభం

అనంతపురం కల్చరల్: భారతదేశంలో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూతోనే శాస్త్రీయ విజ్ఞానం ప్రపంచ వ్యాప్తమైందని జనవిజ్ఞానవేదిక సీనియర్ నాయకురాలు డాక్టర్ ప్రసూన అన్నారు. జేవీవీ నగర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం జనవిజ్ఞానవేదిక కార్యాలయంలో నెహ్రూ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ ప్రసూనతో పాటూ జేవీవీ నగర కమిటీ అధ్యక్షుడు రామిరెడ్డి, సెక్రటరీ వీరరాజు తదితరులు మాట్లాడారు. ప్రజాగాయకుడు లక్ష్మీనారాయణ, గాంగేనాయక్, రామకృష్ణ తదితరులు నెహ్రూ గురించి మాట్లాడారు.



మాంటిస్సోరిలో చిన్నారులసాంస్కృతిక కార్యక్రమం



చిన్నారుల ర్యాంప్ షో



ఆత్మకూరులో చిన్నారులతో కేక్ కట్ చేయిస్తున్న అధికారులు, ఎంపీపీ హేమలత



మినర్వా స్కూల్‌లో నెహ్రూ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం



మోక్షిత్ స్కూల్‌లో 2కే రన్‌ను ప్రారంభిస్తున్న సీఐ రెడ్డప్ప



నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



రంగోలి విభాగంలో విజేతలను అభినందిస్తున్న విశాల ఫెర్రర్

ఘనంగా తోపుదుర్తి చందు జన్మదిన వేడుకలు



తోపుదుర్తి బ్రదర్స్‌ను గజమాలతో సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

రాప్తాడురూరల్ /ఆత్మకూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాప్తాడు నియోజకవర్గ సీనియర్ నాయకులు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి (చందు) జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మంగళవారం జరుపుకున్నారు. అనంతపురం నగర శివారులోని నివాసం, రాప్తాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద వేడుకలు చేసుకున్నారు. చందూను పెద్ద ఎత్తున గజమాలలతో సత్కరించారు. ఆయనతో కేక్‌లు కట్ చేయించారు. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. సోదరుడు, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి కేక్ తినిపించి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అన్ని మండలాల్లోనూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు తోపుదుర్తి చందు జన్మదిన వేడుకలను జరుపుకున్నాయి. నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఏ చిన్న కష్టం వచ్చినా నేనున్నానంటూ తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి ముందుంటారని పలువురు పేర్కొన్నారు. జన్మదిన వేడుకల్లో రాప్తాడు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ తాటిచెర్ల నాగేశ్వరరెడ్డి, అనంతపురం రూరల్ జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, ఏడీసీసీ బ్యాంకు డైరెక్టర్ జనార్దన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, నాయకులు ధనుంజయయాదవ్, అనంతపురం రూరల్ మండల కన్వీనర్ దుగుమర్రి గోవిందరెడ్డి, యువజన విభాగం మండల కన్వీనర్ డాక్టర్ శీనా, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు.

'అనంత'లో అపరిచితుడి హంగామా

అనంతపురం సిటీ: జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం 6.30 గంటల సమయంలో ఓ యువకుడు హంగామా సృష్టించారు. కేవలం పంచె మాత్రం ధరించిన ఆ యువకుడు జీఆర్పీ పోలీస్‌స్టేషన్‌కు సమీపంలోని పట్టాలపై నిల్చొని రైలు ఇంజిన్‌ను అడ్డుకున్నాడు. లోకో పైలెట్లు హారన్ మోగించినా ఆ యువకుడు కదల్లేదు. దీంతో లోకో ఇంజిన్‌కు పైలెట్లు బ్రేక్ వేసి నిలిపేశారు. పరిస్థితి గమనించిన జీఆర్పీ ఎస్ఐ విజయకుమార్ వెంటనే సిబ్బందిని అప్రమత్తం చేసి, ఆ యువకుడిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించాడు. మహిళా కానిస్టేబుళ్లతో పాటు పురుష కానిస్టేబుళ్లు విశ్వప్రయత్నం చేసినా చేతికి చిక్కకుండా పట్టాల వెంబడి పరుగులు తీస్తూ ముప్పు తిప్పలు పెట్టాడు. దాదాపు అరగంటకు పైగా ఈ తతంగం ఉత్కంఠను రేకెత్తించింది. చివరకు రైల్వే పరిసరాల నుంచి దూరంగా తరిమేయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. యువకుడు ఎవరైంది ఆచూకీ కనుగొనేందుకు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆరా తీస్తున్నారు.

చిన్నారులకు మెరుగైన వైద్యం

అనంతపురం కార్పొరేషన్: చిన్నారులకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని చిన్నపిల్లల వార్డులో చిల్డ్రన్స్ డే నిర్వహించారు. సూపరింటెండెంట్ మాట్లాడుతూ గతంతో పోల్చితే ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలు, వైద్య సేవలు మెరుగుపరిచినట్లు తెలిపారు. ప్రభుత్వం ఖరీదైన వైద్యం ప్రజలకు ఉచితంగా అందిస్తోందన్నారు. వార్డుల్లో రోగుల సహాయకులు ఎక్కువగా ఉండకూడదన్నారు. అధిక సంఖ్యలో రోగుల వద్ద ఉండడం వల్ల ఇన్‌ఫెక్షన్స్ వచ్చే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ రవికుమార్, ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

రేపు లక్ష దీపోత్సవం

అనంతపురం కల్చరల్: నగరంలోని వేమన టెలిఫోన్ భవన్ ఎదురుగా ఉన్న షిర్డీసాయిబాబా మందిరంలో ఈనెల 16న సాయంత్రం 6.30 గంటలకు లక్ష దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు జయచంద్రచౌదరి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

క్రైస్తవుల సంక్షేమానికి జగన్ కృషి

- ఏపీ ప్రభుత్వ సలహాదారు బాలస్వామి



మాట్లాడుతున్న క్రైస్తవ మైనార్టీ విభాగం ప్రభుత్వ సలహాదారు రెవరెండ్ ఫాదర్ బాలస్వామి

రాప్తాడురూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి క్రైస్తవుల సంక్షేమానికి పాటుపడుతున్నారని ఏపీ ప్రభుత్వ సలహాదారు (క్రైస్తవ మైనార్టీ) ఫాదర్ ఎం. బాలస్వామి పేర్కొన్నారు. మంగళవారం అనంతపురం జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 41వ సర్వసభ్య సమావేశం అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి సమీపంలోని యేసు కృపా మందిరంలో జరిగింది. పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రెడ్డి వారి నెహెమ్యా నాగరాజు అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎం.బాలస్వామి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయనివిధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. స్థానిక సంఘ కాపరి పాస్టర్ నవీన్ కుమార్, పి. మార్క్, పాస్టర్ కె. జీవన్, డాక్టర్ ఎనోక్ జార్జ్, అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ బందెల రాజు, బైబిల్ మిషన్ ఏపీఎస్‌పీఎఫ్ రాయలసీమ రీజనల్ చైర్మన్ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, పాస్టర్ జాషువా, జహంగీర్, పాస్టర్ సుధాకర్ పాల్గొన్నారు.

అనంతపురం కల్చరల్: విశ్వసనీయతకు మారుపేరు వైఎస్సార్ కుటుంబం అని ఏపీ ప్రభుత్వ సలహాదారు (క్రిస్టియన్, మైనార్టీ) రెవరెండ్ డాక్టర్ బాలస్వామి అన్నారు. మంగళవారం స్థానిక అరవిందనగర్‌లోని సీఎస్ఐ చర్చి పాస్టర్, సంఘ సభ్యులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పాస్టర్ల సంఘం అధ్యక్షులు నెహెమ్యా నాగరాజు, గౌరవాధ్యక్షులు రెవరెండ్ బందెల రాజు, సీఎస్ఐ పాస్టర్ బెన్‌హర్‌బాబుతో కలిసి డాక్టర్ బాలస్వామి మాట్లాడారు. వైఎస్సార్, జగన్‌మోహనరెడ్డి పాలనలో విశ్వసనీయతపై మాట్లాడారు. అనంతరం రెవరెండ్ బాలస్వామి ప్రత్యేకంగా ప్రార్థన చేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు సునీల్‌కుమార్, జయరామ్, తాడిపత్రి క్రైస్తవ మైనార్టీ నాయకులు వేణుగోపాలరెడ్డి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్యదర్శులపై ఆగ్రహం

అనంతపురం కార్పొరేషన్: విధుల్లో సమయపాలన పాటించని పారిశుధ్య కార్యదర్శులపై అదనపు కమిషనర్ రమణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం నగరంలోని వివిధ సర్కిళ్లను హాజరుపట్టికను అదనపు కమిషనర్ పరిశీలించారు. 3వ సర్కిల్‌లో పారిశుధ్య కార్యదర్శులు ఇస్మాయిల్, రమేష్, వాణి తదితరులు వేకువజామున విధులకు గైర్హాజరయ్యారు. అనంతరం వారికి మెమో ఇస్తున్నట్లు అదనపు కమిషనర్ తెలిపారు.

డబ్బులు పోయాయని ఫిర్యాదు

అనంతపురం క్రైం: స్థానిక బళ్లారి బైపాస్‌లో చిరు హోటల్‌కు భోజనానికి వచ్చిన ఓ వ్యక్తి రూ.25 వేలు నగదు పోగొట్టుకున్నట్లు నాల్గో పట్టణ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు హోటల్ సప్లయర్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు.

వైఎస్సార్ బీమా అందజేత

ఆత్మకూరు: పంపనూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో హరిజన సూరప్ప మరణించాడు. ప్రమాదంలో సూరెప్ప భార్య లక్ష్మీదేవి కూడా గాయపడింది. ప్రస్తుతం ఆమె అనంతపురంలో చికిత్స పొందుతోంది. మంగళవారం సర్పంచ్ ఎర్రిస్వామి, వీఆర్వో ప్రసాద్, సెక్రటరీ శిరీష బీమా సాయం అందించారు.

శివాలయాల్లో కార్తీక కాంతులు

అనంతపురం కల్చరల్: పవిత్ర కార్తీకమాసం మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. నగరంలోని శివాలయాలు ప్రత్యేక పూజలతో శివారాధనతో భక్తి భావాన్ని పెంచాయి. మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో ప్రధాన అర్చకులు నరసింహశాస్త్రి ఆధ్వర్యంలో మహాశివుడు ప్రత్యేక అలంకార సేవల్లో దర్శనమిచ్చాడు. అధిక సంఖ్యలో మహిళలు కార్తీక దీపాలతో శివునికి భక్తినీరాజనాలర్పించారు. పాతూరులోని విరూపాక్షేశ్వరాలయం, అరవిందనగర్ సర్వేశ్వరాలయం తదితర చోట్ల కార్తీకమాసం ఆరంభ పూజలు జరిగాయి.

20 నుంచి కార్తీక మాసపూజలు

అనంతపురం అర్బన్: నగరంలోని మారుతీనగర్ 80 అడుగుల రోడ్డులోని అయ్యప్పస్వామి ఆలయంలోని శివాలయంలో ఈనెల 20 నుంచి నాలుగు సోమవారాలు కార్తీక మాస పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. నాలుగు సోమవారాలు ప్రదోషకాలంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం ఉంటుందన్నారు. 20న బిల్వార్చన, 27న దీపోత్సవం, డిసెంబరు 4న పార్థివలింగార్చన, 11న పార్వతీపరమేశ్వరుల కళ్యాణ మహోత్సవం ఉంటుందన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం



వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తదితరులు



శ్రీనివాసనగర్‌లో ఇంటింటికీ వెళ్లి మహిళలతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అనంతపురం రూరల్: రాజకీయాలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేసుకుందామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఏ. నారాయణపురం పంచాయతీ పరిధిలోని స్టాలిన్ నగర్‌లో వై నీడ్స్ ఏపీ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి హాజరయ్యారు. తపోవనం స్టాలిన్‌నగర్‌లో వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. 2024 ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలకు బుద్ధి చెప్పి అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. నగరానికి దీటుగా పంచాయతీలను అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే అన్నారు. జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీలు నాగేంద్ర, శృతి, ఖాజా, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లెల వేణుగోపాల్, ఉమ్మడి జగన్‌మోహన్‌రెడ్డి, సత్యన్న, రామసుబ్బారెడ్డి, బి.మదన్‌మోహన్‌రెడ్డి, బషీర్, పురుషోత్తంరెడ్డి, రామాంజులరెడ్డి, జాఫర్, నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

మంచి చేస్తున్న ప్రభుత్వానికి మద్దతిస్తాం

అనంతపురం కార్పొరేషన్: గత ప్రభుత్వం కంటే జగనన్న ప్రభుత్వంలో మాకు అన్ని విధాలా అభివృద్ధి జరిగిందని, మంచి చేస్తున్న ప్రభుత్వానికి తాము మద్దతుగా ఉంటామని శ్రీనివాస్‌నగర్‌కు చెందిన లక్ష్మీదేవి, తదితరులు పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి డ్వాక్రా రుణాలు మాఫీ చేశారన్నారు. సంఘంలో అధికంగా రుణ సదుపాయాన్ని అందించారని, తన భర్తకు వాహన మిత్ర, రైతు భరోసా కూడా వస్తోందని లక్ష్మీదేవి ఆనందాన్ని వ్యక్తం చేశారు. మంగళవారం నగరంలోని 5వ డివిజన్‌కు సంబంధించి వేణుగోపాల్ నగర్‌లో ఉన్న 7వ సచివాలయ ఆవరణంలో సచివాలయ పరిధిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన బోర్డును డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య ఆవిష్కరించారు. అనంతరం శ్రీనివాస్‌నగర్‌లో వైఎస్సార్ సీపీ జెండాను డిప్యూటీ మేయర్లు కోగటం, వాసంతి, పార్టీ నగర అధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ జయలలిత ఆవిష్కరించారు. శ్రీనివాస్ నగర్‌లో కొన్ని ఇళ్లకు వెళ్లి గత ప్రభుత్వం, ప్రస్తుతం వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో అందిన సంక్షేమం, అభివృద్ధిపై ప్రజలను అడిగారు. స్థానికులు జగనన్న ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తామని, అత్యధికంగా మార్కులిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు, టీపీఆర్ఓ జ్యోతి, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, క్లస్టర్ ఇన్‌చార్జ్ పీవీ రమణారెడ్డి, నాయకులు అంకిరెడ్డి ప్రమీళ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రూ.12.44 కోట్ల సంక్షేమం, అభివృద్ధి: ఐదో డివిజన్ ఏడో సచివాలయ పరిధిలో రూ.12.44 కోట్ల సంక్షేమం, అభివృద్ధి జరిగింది. సచివాలయ పరిధిలోని 2,366 మంది లబ్ధిదారులకు రూ.7,10,29,178 (రూ.7.10 కోట్లు) ఖాతాల్లో జమ కాగా, పరోక్షంగా 1,065 మందికి రూ.4,36,74,317 (రూ.4.36 కోట్లు) అందింది. రూ.87 లక్షలతో రోడ్లు, కాలువలు, అభివృద్ధి పనులు చేపట్టారు.

నేడు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం:

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 8, 11వ సచివాలయాల పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరగనుంది. సచివాలయ సమీపంలో సంక్షేమం, అభివృద్ధి బోర్డు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను ప్రజాప్రతినిధులు ఆవిష్కరించనున్నారు.

వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: గత టీడీపీ ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని గాలికొదిలేస్తే..సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నారని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పాతూరు పవర్ ఆఫీస్ సమీపంలోని వాల్మీకి నగరపాలక పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం ఐసీడీఎస్ ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో ఉన్న ప్రభుత్వ సర్వజనాస్పత్రి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, సీడీ ఆస్పత్రి, వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వైద్య సదుపాయాలను ప్రభుత్వం కల్పించిందన్నారు. 64 రకాల వైద్య పరీక్షలు, 172 రకాల మందులు ఇస్తున్నట్లు తెలిపారు. మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ యుగంధర్, కార్పొరేటర్లు లీలావతి, లావణ్య, శ్రీనివాసులు, పార్టీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్, ఎంహెచ్ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి పాల్గొన్నారు.

అనంతపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం అనంతపురం రూరల్ మండలం రాజీవ్‌కాలనీలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమంతో పాటు వైద్య రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పేద ప్రజలు అనారోగ్యంబారిన పడకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. 108, 104 సేవలను కొనసాగించడంతో పాటు ప్రతి గ్రామంలో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్న ఉద్దేశంతో గ్రామ, వార్డుల్లో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి ప్రజల చెంతకే వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆశాబీ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ సంధ్య, వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆరోగ్య సురక్ష శిబిరాలు

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని పలు ప్రాంతాల్లో, రూరల్ పరిధిలోని ఒక ప్రాంతంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు జరగనున్నాయి. నగరంలోని ఛత్రపతి శివాజీ, మాంటిస్సోరీ స్కూల్‌లో, రాజీవ్‌కాలనీ సచివాలయం– 2లో వైద్య శిబిరాలు జరగనున్నాయి.